క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి చర్యలు

డీఐఈఓ ఎస్ఎస్ఎన్ రెడ్డి



మైలవరం: గ్రామాల నుంచి కళాశాలలకు వచ్చే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎన్టీఆర్ జిల్లా ఇంటర్ మీడియెట్ విద్యాశాఖాధికారి (డీఐఈఓ) ఎస్ఎస్ఎన్ రెడ్డి అన్నారు. మైలవరం వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం డీఐఈఓ సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. గ్రామాల నుంచి కళాశాలకు వచ్చి వెళ్లే విద్యార్థులు బస్‌ల కోసం ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆర్టీసీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా వెదురుబీడెం, కనిమెర్ల తండా గ్రామాలకు చెందిన విద్యార్థులు బస్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి వచ్చిందని, డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సీపీఎం ప్రజా పోరు ప్రారంభం



తిరువూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని సీపీఎం తిరువూరు పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్రప్రసాద్ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో అధిక ధరల తగ్గింపు, ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజా పోరు కార్యక్రమాన్ని స్థానిక సినిమా హాల్స్ సెంటర్లో శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. రైతులు, కౌలు రైతులు, నిరుద్యోగులు, మహిళలు, విద్యార్థుల ఇబ్బందులను ప్రజా పోరు ద్వారా ప్రభుత్వానికి తెలుపుతామన్నారు. ప్రజా పోరు కరపత్రాలను సీనియర్ నాయకుడు ఎస్‌వీ భద్రం ఆవిష్కరించారు. పార్టీ నాయకులు ఆకుల రవి, పంతంగి శ్రీనివాసరావు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవస్థానం వార్షికోత్సవం



జి.కొండూరు: జి.కొండూరులోని పార్వతీదేవి సమేత అమృత లింగేశ్వరస్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ పండితులు పూజా కార్యక్రమాల అనంతరం ఎమ్మెల్యేకి తీర్థప్రసాదాలను అందజేశారు. నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

చదువుపై దృష్టి సారించాలి



నూజివీడు: పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుపై శ్రద్ధ పెట్టాలని డీవైఈఓ ఎం.సేవియా అన్నారు. మండలంలోని గొల్లపల్లి హైస్కూల్‌ను శుక్రవారం డీవైఈఓ సందర్శించి పలు సబ్జెక్టుల్లో పదో తరగతి విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి స్థాయిని పరిశీలించారు. డీవైఈఓ మాట్లాడుతూ చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులను ఉపాధ్యాయులు గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సోషల్ ఆడిట్



చాట్రాయి: ఉపాధి హామీ పథకం పనులపై పారదర్శకంగా సోషల్ ఆడిట్ చేయాలని స్టేట్ రిసోర్స్‌పర్సన్ నందిని అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోషల్ ఆడిట్‌పై డీఆర్‌పీలకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో 2023–24 సంవత్సరాల్లో సుమారు రూ.11 కోట్లతో చేసిన పనులపై సామాజిక తనిఖీ చేస్తామని చెప్పారు.



నూజివీడు ఊటవాగుపై ప్రమాదకరంగా ఉన్న కాజ్‌వే



తుక్కులూరు-కాట్రేనిపాడుల మధ్య రెయిలింగ్స్ లేని కాజ్‌వే



దంతులవారిగూడెం-మర్రికుంట వరదలకు దెబ్బతిన్న చప్టా

ప్రాణాలు వాగులోకే!

- ప్రమాదకరంగా లో లెవల్ కాజ్‌వేలు
- ఇరువైపులా రెయిలింగ్‌లు లేని వైనం
- ఎప్పుడు, ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన

నూజివీడు: నూజివీడు మండలంలో రామిలేరు, ఊటవాగులు ప్రవహిస్తున్నందున వర్షాకాలం, తుపాన్ల సమయంలో వరద నీరు పెద్ద ఎత్తున వస్తోంది. రామిలేరుపై ఉన్న కల్వర్టులు, కాజ్‌వేలకు మరమ్మతులు చేయించాల్సి ఉంది. పోతురెడ్డిపల్లి రోడ్డులో నూజివీడు పట్టణ పరిధిలోని ఊటవాగుపై ఉన్న కాజ్‌వేకు గతంలోనే భారీ రంధ్రం పడగా తాత్కాలికంగా పూడ్చారు. జంగంగూడెం, తుక్కులూరు, దేవరగుంట, మీర్జాపురం-కాట్రేనిపాడుల మార్గంలో ఉన్న లో లెవల్ కాజ్‌వేలు దెబ్బతినడమే కాకుండా రెయిలింగ్స్ లేవు. వీటికి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. రెయిలింగ్స్ లేకపోవడంతో వరదల సమయంలో వాహనాలు వాగులోకి కొట్టుకుపోతున్నాయి. వరదలో కొట్టుకుపోయే వారికి రెయిలింగ్స్ అడ్డుగా ఉంటాయి. వాటిని పట్టుకొని ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఉంటుంది.

> నూజివీడు నియోజకవర్గంలోని పలు గ్రామాల వాగులపై లో లెవల్ కాజ్‌వే, చప్టా, కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. ప్రధానంగా రెయిలింగ్స్ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోననే ఆందోళన వాహనదారుల్లో వ్యక్తమవుతోంది. దెబ్బతిన్న కల్వర్టులు, కాజ్‌వేల వద్ద వెంటనే మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది.



తుక్కులూరు-జంగంగూడెం మధ్య రామిలేరుపై వంతెన ఇలా..

వరదలకు కొట్టుకుపోయిన చప్టా

నూజివీడు మండలంలోని దంతులవారిగూడెం-మర్రికుంట గ్రామాల మధ్య ఊటవాగుపై చప్టా ఉండగా రెండు నెలల కిందట వరదలకు చప్టా కొట్టుకుపోయి రోడ్డు గోతులమయంగా తయారైంది. ఆగిరిపల్లి మండలంలో నూగొండపల్లి వద్ద ప్రవహించే వాగుపై ఉన్న వంతెనకు రెయిలింగ్స్ లేక ప్రమాదకరంగా ఉంది. తోటపల్లి-చిన్నాగిరిపల్లి మధ్య ఉన్న లో లెవెల్ కాజ్‌వే సైతం ప్రమాదకరంగా ఉంది. నియోజకవర్గంలో ప్రమాదకరంగా ఉన్న లో లెవల్ కాజ్‌వేలు, చప్టాలు, కల్వర్టులకు మరమ్మతులు చేయించి ప్రమాదాలు సంభవించకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కాజ్‌వేలకు మరమ్మతులు చేయాలి



ప్రమాదకరంగా ఉన్న కాజ్‌వేలకు ప్రభుత్వం వెంటనే మరమ్మతులు చేయాలి. రెయిలింగ్స్ నిర్మిస్తే ప్రమాదాలు సంభవించకుండా ఉంటాయి. వరదలు వచ్చేటప్పుడు వాహనాలు వాగులోకి కొట్టుకుపోకుండా రెయిలింగ్స్ అడ్డుకుంటాయి.

– షేక్ మస్తాన్‌వలి, నూజివీడు

ఏళ్ల తరబడి ఇంతే..



వాగులపై ఉన్న లో లెవల్ వంతెనలు, చప్టాలు, కాజ్‌వేలు ఏళ్ల తరబడిగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. వీటిపై నుంచి వాహనాలు పడిపోవడమే కాకుండా పశువులు సైతం ఒక్కోసారి కిందకు పడిపోతున్నాయి. రెయిలింగ్స్‌ను ఏర్పాటు చేయాలి.

– కంభాల దాసు, కాట్రేనిపాడు

సహజ వనరుల దోపిడీకి అడ్డాగా మైలవరం

- ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు
- చక్రం తిప్పుతున్న ఎమ్మెల్యే బావమరిది

మైలవరం: మైలవరం నియోజకవర్గం ప్రస్తుతం స్థానికేతరులైన ఎమ్మెల్యేల దోపిడీకి అడ్డాగా మారింది. మైలవరం మండలంలోని సహజవనరులైన ఇసుక, మట్టి, గ్రావెల్‌లతో పాటు ఇబ్రహీంపట్నంలోని బూడిద చెరువులో బూడిదను అడ్డంగా తవ్వుకుని సొమ్ము చేసుకుంటున్నారు.

దోపిడీకి అంతేలేదు

మైలవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ బావమరిది దోపిడీకి అంతం లేకుండా పోయింది. మైలవరం మండలం వెదురుబీడెం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డు అభివృద్ధి పనులకు మూడు ఎకరాల్లో గ్రావెల్ తవ్వుకునేందుకు అనుమతులు తీసుకున్నాడు. క్వారీ నుంచి గ్రావెల్ తీసుకువెళ్లే లారీల ఏర్పాటు విషయంలో గొడవ చేసి ఎమ్మెల్యే బామ్మర్ది దీనిని దక్కించుకున్నాడని విశ్వసనీయంగా తెలిసింది. అంతేగాక వెదురుబీడెం క్వారీ నుంచి గ్రావెల్ తవ్వకునేందుకు ఆయన ఇతరులను అడ్డుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనితో వారు దిగ్భ్రాంతికి గురై మేమూ టీడీపీ వాళ్లమేనని, ఎన్నికల్లో పార్టీ విజయానికి ఎంతో కష్టపడ్డామని చెప్పినా వినకుండా సొమ్ము చెల్లించాల్సిందేనంటూ లారీలను అడ్డుకున్నాడు. మద్యం దుకాణాల్లోను దందా నడుస్తుండటంతో నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లలో అంతర్మథనం మొదలైంది. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నా ఎమ్మెల్యే బామ్మర్ది కావడంతో అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. గతంలో ఇదే వెదురుబీడెం గ్రామం నుంచి గ్రావెల్‌ను ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌చార్జిగా వ్యవహరించిన వ్యక్తి అమ్ముకుని సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి..



వెదురుబీడెం క్వారీలో రాత్రి వేళల్లో పొక్లెయిన్‌తో గ్రావెల్ తవ్వకాలు



వెదురుబీడెం క్వారీ వద్ద గ్రావెల్ రవాణాకు సిద్ధంగా ఉన్న లారీలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పాము కలకలం

తిరువూరు: స్థానిక పాత బస్టాండు సెంటర్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి విష సర్పం రావడంతో శుక్రవారం కార్యాలయ సిబ్బంది, కక్షిదారులు భయభ్రాంతులకు గురయ్యారు. ఉదయం కార్యాలయం ప్రారంభమయ్యే సమయానికి కార్యాలయ ఆవరణలో పాము కనిపించడంతో సిబ్బంది బయటికి పరుగులు తీశారు. స్నేక్ రెస్క్యూటీం కన్వీనర్ ఉయ్యూరు జయప్రకాష్ ఆధ్వర్యంలో శరత్, సుధీర్ వచ్చి పామును పట్టుకోవడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. అతి పురాతనమైన రిజిస్ట్రార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరి తరచూ విష సర్పాలు సంచరిస్తుండటంతో సిబ్బంది భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. కార్యాలయానికి నూతన భవనం నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



తిరువూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పామును పట్టుకున్న జయప్రకాష్

నేడు వేంకటాచలస్వామికి పుష్పయాగం

తిరువూరు: స్థానిక శ్రీ వేంకటాచలస్వామి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా శనివారం పుష్పయాగం కార్యక్రమం నిర్వహిస్తామని వైష్ణవ గోష్టి సభ్యులు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పలు రకాల పుష్పాలతో స్వామివారికి విశేష అలంకరణ, పూజాదికాలు జరుగుతాయని వివరించారు.

పాత పుస్తకాలతోనే కాలక్షేపం



పాత పుస్తకాలతోనే బోధిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

అంగన్‌వాడీలకు అందని కొత్త పుస్తకాలు

ఆగిరిపల్లి: విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన పాఠ్య పుస్తకాలు అందలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆటపాటలతో కూడిన బొమ్మల పుస్తకాలు అందజేసింది. దీంతో చిన్నారులు ఉత్సాహంగా అంగన్‌వాడీ బాట పట్టేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలు ఇప్పటివరకూ ఇవ్వలేదు. పాత పుస్తకాలతోనే సరిపెట్టుకోవాలని అనధికారిక ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. దీంతో అంగన్‌వాడీ సిబ్బంది చేసేది లేక పాత పుస్తకాలతోనే పాఠాలు చెబుతున్నారు.



గత ప్రభుత్వంలో ఇచ్చిన పాఠ్య పుస్తకాలు

3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలకు ఆంగ్లం, గణితం, ఇంగ్లిష్, యాక్టివిటీ, డ్రాయింగ్‌కు సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన కిట్లు అందించారు. దీంతో బొమ్మలతో కూడిన పుస్తకాలు చూపిస్తూ చిన్నారులు బోధించడం సులువుగా ఉండేది. పిల్లలు కూడా ఆసక్తిగా నేర్చుకునే వారు. ప్రస్తుత ప్రభుత్వంలో అంగన్‌వాడీ బోధన మొక్కుబడి తంతుగా మారింది.

పాత పుస్తకాలతోనే బోధిస్తున్నాం..

అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు ఇంకా రాలేదు. వచ్చిన వెంటనే ఆయా కేంద్రాలకు అందజేస్తాం. ప్రస్తుతం మా వద్ద ఉన్న పాత పుస్తకాలతోనే బోధిస్తున్నాం. టైం టేబుల్ ప్రకారం అన్ని స్కూళ్లలో చిన్నారులకు బోధన జరుగుతోంది.

– నూరాని, ఐసీడీఎస్, సీడీపీఓ

సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి

భవన నిర్మాణ కార్మికుల డిమాండ్

తిరువూరు: భవన నిర్మాణ కార్మికులకు గతంలో ఉన్న సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని తిరువూరు మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం సీఐటీయూ మండల కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, తిరువూరులో కార్మిక శాఖాధికారి కార్యాలయం మూసి వేసి నెలలు గడుస్తున్నాయని, ఏఎల్‌ఓను నియమించి భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నల్లగొర్ల వేలాద్రి, సభ్యులు పాల్గొన్నారు.

ఎ. కొండూరులో ధర్నా

ఎ.కొండూరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎ.కొండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి జట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, ఉచిత ఇసుక అందిస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా భవన నిర్మాణ కార్మికుల గురించి మాట్లాడిన దాఖలాలు లేవని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సంక్షేమ బోర్డు తెరిపించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని, ఉచిత ఇసుక ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిములు అన్నీ పరిష్కారించాలని కోరారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ రాముకు వినతిపత్రం అందించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

- **ఇబ్రహీంపట్నం:** భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. యూనియన్ మండల అధ్యక్షుడు పెండ్యాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తహసీల్దార్‌కు వివరించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించి యాక్సిడెంట్లు, ఇతర క్లెయిములు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యదర్శి వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.
- **మైలవరం:** మైలవరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు తెరిపించాలని, తక్షణమే నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మైలవరం పంచాయతీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని డెప్యూటీ తహసీల్దార్ శ్రీహరికి అందజేశారు. మైలవరం మండల కార్యదర్శి చాట్ల సుధాకర్, నాయకులు కార్మికులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికుల సంఘ నాయకులు



ఎ.కొండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు



ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కార్మిక వ్యతిరేక వైఖరిని నిరసించాలి

నూజివీడు: ప్రధాని నరేంద్ర మోదీ రైతు ఉద్యమ విరమణ సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేయడాన్ని నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఈ నెల 26న దేశవ్యాప్తంగా 'వార్నింగ్' ర్యాలీలు, ధర్నాలు చేయనున్నట్లు అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి.హరినాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతు రుణమాఫీ, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని, నిరుపయోగంగా ఉన్న సెజ్ భూములను తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు కౌలు రైతులకు హామీలేని రుణాలు మంజూరు చేయాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వయోజన విద్య వలంటీర్లకు శిక్షణ

ముసునూరు: చదువు నేర్చుకోలేక పోయిన ప్రతి ఒక్కరికీ నేడు చదువు నేర్పించాలని వెలుగు ఏపీఎం కె.రాంబాబు సూచించారు. మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం వయోజన విద్య వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లు నిండిన, అంత కన్నా పెద్ద వయసు గల వారికి విద్యను బోధించి అక్షరాస్యులను చేయాలని సూచించారు.

ఉల్లాస్‌పై శిక్షణ

ఆగిరిపల్లి: స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ అక్షరాస్యతపై శుక్రవారం వలంటరీ టీచర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీడీఓ భార్గవి పాల్గొన్నారు. వలంటరీ ఉపాధ్యాయులకు కలెక్టర్ చేత సర్టిఫికెట్లు ఇప్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం డి. రాజశేఖర్, ఎంఈఓలు సర్వేశ్వరరావు, ఆనంద్ కుమార్, సీసీలు పాల్గొన్నారు.



10 లీటర్ల సారా స్వాధీనం

మైలవరం: విసన్నపేట మండలం చంద్రుపట్ల తండాకు చెందిన బానోత్ రామారావు సారాను ద్విచక్ర వాహనంపై తీసుకు వెళుతుండగా స్థానిక తిరువూరు రోడ్డు ఆంజనేయస్వామి గుడి వద్ద అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ జె. శ్రీనివాస్ తెలిపారు. అతని నుంచి 10 లీటర్ల సారాను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టులో హాజరు పరిచామన్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం నిందితుడిని విజయవాడ జిల్లా జైల్‌కు రిమాండ్‌కు పంపామన్నారు. దాడుల్లో ఎస్ఐ దుర్గాప్రసాదరావు, సిబ్బంది సర్వేష్, రమేష్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

- **నూజివీడు:** ఎక్సైజ్ సిబ్బంది పట్టణంలోని అజరయ్యపేటలో దాడులు చేసి కాళహస్తి సుధ వద్ద ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సుధపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టుకు తరలించామని ఎక్సైజ్ సీఐ ఎ. మస్తానయ్య తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీకే మద్యాన్ని విక్రయించాలని, మద్యం దుకాణదారులకు గ్రామాల్లోని ప్రైవేటు వ్యక్తులకు మద్యాన్ని సరఫరా చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. బెల్టుషాపులు నిర్వహిస్తున్నా, సారా విక్రయిస్తున్నా సెల్: 94409 02462 కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

జి.కొండూరు: యువతి అదృశ్యంపై జి.కొండూరు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..జి.కొండూరు మండల పరిధి వెలగలేరు గ్రామానికి చెందిన యువతి (30) మానసిక సమస్యలతో బాధపడుతూ బుధవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె ఇప్పటివరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువుల వద్ద ఆరా తీసిన కుటుంబ సభ్యులు జి.కొండూరు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కరపత్రాల ఆవిష్కరణ

నూజివీడు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల జీతాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు డిమాండ్ చేశారు. ఈ నెల 10న ఏలూరులో నిర్వహించే ఆయాల రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలో శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆయాల సంఖ్యను పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ, మెడికల్ బీమా సదుపాయాన్ని కల్పించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముసునూరు: ముసునూరు, కాట్రేనిపాడు, వెంకటాపురం విద్యుత్ సబ్ స్టేషన్ల మెయింటనెన్స్ కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ వీరబాబు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ మూడు సబ్ స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

ప్రజా పోరును విజయవంతం చేయండి

మైలవరం: సీపీఎం ఆధ్వర్యంలో విజయవాడలో ఈ నెల 14న జరుగనున్న ప్రజా పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పీవీ ఆంజనేయులు నాయకులు, కార్యకర్తలకు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను అదుపు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని, రాష్ట్రంలో మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీల భారం మోపి ప్రజలపై ఆర్థిక భారం పడేసి దుర్మార్గపు ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు.